# నిషిద్ధం

--సింగమనేని నారాయణ

అరగంట ముందుగా ఆఫీసు నుంచీ వెళ్ళటానికి పర్మిషన్ లెటర్ యిచ్చింది మేనేజరుకు మమత. లెటర్ చదివి "ఈ మాత్రానికే రాతమూలకంగా యివ్వాలేమమ్మా. అడిగితే చాలుగదా" అన్నాడు మెత్తని మందలింపు స్వరంతో మేనేజరు. మమత చిన్నగా నవ్వింది. ఆమె సంవత్సరానికి ఏ ఒకటి, రెండుసార్లోగాని పర్మిషన్ కోరదు. ఆఫీసు విధుల్లో ఆమె సిన్సియారిటీ చాలా యిష్టం మేనేజర్‌కు.




ఆఫీసు నుంచీ ఇల్లు దగ్గరే. పది నిమిషాలు నడక గబగబా నడిచి యింటికి చేరుకుంది మమత. వంటింట్లో పాలు మరగబెడుతూ వుంది అమ్మ. ఇంట్లో ఎవ్వరూ లేరు. నాన్న యింకా ఆఫీసు నుంచీ రాలేదు. తమ్ముడు స్కూల్ నుంచీ రావటానికి యింకో అరగంట పడుతుంది.

అడుగుల చప్పుడు విని తలతిప్పి, "అప్పుడే వచ్చేశావేమమ్మా" అంది ఆశ్చర్యంగా తల్లి. మమత తల్లికి దగ్గరగా వచ్చి "నిన్నో విషయం అడగనా అమ్మా" అంది మెల్లగా. 'ఏమిటి' అన్నట్టు చూసింది ఆమె, కూతురు ధోరణి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ.

"ఉదయం భాస్కర్ ఆఫీసు దగ్గరకొచ్చాడు నాకోసం" అంటూ ఆగింది మమత.

'ఎందుకు' అన్నట్టు తలాడించింది తల్లి,

పాలుకాచిన గిన్నె కందిక దించుతూ.

"ఏమీ అనుకోకపోతే సాయంత్రం నాతో సినిమాకు వస్తారా మీరు అనడిగాడు నన్ను......" చెప్పటం ఆపింది మమత తల్లి ముఖంలోకి చూస్తూ.

"నువ్వేమన్నావ్" వెంటనే అడిగింది తల్లి.

"బావుండదేమో అన్నాను నేను. ఆయన ముఖం చాలా ఇబ్బందిగా పెట్టాడు. ముఖం చూస్తే జాలేసింది. 'కాదు కూడదు' అని తిరస్కరించలేక పోయాను. వద్దనటానికి బలమైన కారణం ఏం చెప్పను రెండు నిమిషాలాగి అలాగే అని ఒప్పేసుకున్నాను. 'అజంతా థియేటర్ దగ్గర ఆరింటికల్లా వెయిట్ చేస్తుంటాను' అన్నాడు. అందుకని అరగంట ముందుగా పర్మిషన్ తీసుకుని వచ్చాను." అంది మమత ఆగి ఆగి చెబుతూ.

"నీ యిష్టం మమతా! నువ్వేం చిన్న పిల్లవుకాదు. అయినా ఇంకా పెళ్లికూడా నిశ్చయం కాకముందే, ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో అని..... సరే వెళ్లిరామ్మా!" అంది తల్లి

మమతస్నానం చేసి బట్టలు మార్చుకుంది. తాను కూడా చూడాలనుకుంటున్న సినిమా కాబట్టి ఆమెకూ ఆసక్తిగానే ఉంది. భాస్కర్ సినిమాకు పిల్చినపుడు "ఏ సినిమాకు వెళ్దామండీ" అంది తను. అతను మూడు నాలుగు సినిమాలపేర్లు సజెస్ట్ చేశాడు. అన్నీ మొగుడూ పెళ్లాల పేర్లున్న సినిమాలే! తను ఆశ్చర్యపోయింది అతని అభిరుచికి. ఆ పేర్లు వింటూంటే డోకు వచ్చినట్టయి ముఖం వికారంగా పెట్టింది. "మరినువ్వే చెప్పు ఏ సినిమాకెళ్దామో" అన్నాడతను.

"అంకురం కెళ్దామండీ! పౌరహక్కుల మీద వచ్చిన మంచి సినిమా అట! దాని గురించి పత్రికల్లో కూడా చక్కని వ్యాసాలొచ్చాయి" అంది తను.

"అంకురమా! మా ఫ్రెండొకడు చూసొచ్చి బాగా లేదన్నాడే" అన్నాడు.

"చాలా బావుంటుంది. చూసింతర్వాత మాట్లాడుకుందాం" అంది తను.

"సరే! ఏదో ఒక సినిమా - మనం కలిసి చూడటమే నాకు కావల్సింది" అన్నాడతను.

ఐదున్నర కావస్తూండగా అమ్మతో చెప్పి యింటినుంచీ బయలుదేరింది మమత. ఇంటికి 'బస్‌స్టాప్' చాలా దగ్గర.

మమతకూ భాస్కర్‌కూ పెళ్లి సంబంధం కుదిరి దాదాపు నెల కావస్తోంది. మంచిరోజులు దగ్గర్లో లేవని, పెళ్లి వచ్చేనెలలో జరిపించాలని అనుకున్నారు. పెళ్లికి రెండువారాల ముందు 'నిశ్చితార్థం' జరిపి లగ్నపత్రిక రాయించే ఉద్దేశంలో ఉన్నారు. భాస్కర్ అదేవూళ్లో జూనియర్ కాలేజిలో సైన్స్ లెక్చరర్. భాస్కర్ మమతల పెళ్లి సంబంధం పెద్దలు కుదిర్చిందే. నాలుగైదు సందర్భాల్లో భాస్కర్ మమతను చూశాడు. అతనికి ఆమె నచ్చింది. నచ్చటానికి ముఖ్యకారణాల్లో ఆమె ఉద్యోగం చేస్తూండటం ఒకటి. ఒక మధ్యవర్తి ద్వారా పెళ్లి చూపులూ, బేరసారాలూ జరిగాయి. మమత తండ్రి పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా పనిచేస్తున్నాడు. పెద్ద ఆస్తిపాస్తులు లేకపోయినా సొంతయిల్లు ఉంది. ఒక కూతురూ, ఒక కొడుకూ - అబ్బాయికి నచ్చింది కాబట్టి కట్నం దగ్గర కాస్తా పట్టూ విడుపూ జరిగింది. యభైవేల నగదూ, పది తులాల బంగారమూ ఇవ్వటానికీ, పెళ్లి ఖర్చు భరించటానికీ మమత తండ్రి ఒప్పుకున్నాడు.

దాదాపు పెళ్లినిశ్చయమన్నభావన కలిగినప్పటినుంచీ భాస్కర్ వాళ్లింటికి అడపాదడపా వస్తూనే ఉన్నాడు. గత ఆదివారం మమతను పార్క్‌దాకా రమ్మని పిలిచాడుకూడా. అమ్మనడిగి అతనివెంట పార్కుకువెళ్లింది మమత.

పార్క్‌లో ఒక బెంచీమీద కూచున్నారిద్దరూ - తను కాలేజీ గురించి స్టూడెంట్స్ గురించీ అతను చెబుతూంటే మౌనంగా వింటోంది మమత. కాలక్షేపం కోసం రెండు బఠానీ పొట్లాలు కొని ఆమె చేతికొకటిచ్చాడతను.

"నువ్వేమీ మాట్లాడవేం మమతా" అన్నాడతను. ప్రారంభం నుంచే అతను తన్ను ఏకవచనంలో సంబోధిస్తూండటం ఆమె గమనించింది. ఆత్మీయంగా అతడు తనపట్ల తీసుకుంటున్న చనువుగా దాన్ని ఆమె సర్దుకుంది.

"మీరు చెబుతున్నారుగా" అంది నవ్వుతూ.

"ఇంతకూ నీతోపెళ్లికి ఎందుకు ఒప్పుకున్నానో తెలుసా మమతా" అడిగాడు ఆమె భుజం మీద మెత్తగా చేయివేస్తూ.

ఎందుకు తెలీదు? నెలకు రెండువేలు సంపాదిస్తున్నాను. ఏభైవేలు కట్నం ఇస్తున్నాను. నీకంటే అందంగా ఉంటాను అనుకుంది మనసులో మమత.

"నీ తెలివీ అందమూ నాకు బాగా నచ్చాయి మమతా" అతనే అన్నాడు.

"అలాంటప్పుడు కట్నం తీసుకోకుండా చేసుకోవచ్చుగా" అంది మమత నవ్వుతాలుగా.

"కట్నం తీసుకోకుండా పెళ్లా? నా ప్రిస్టేజి ఏంగావాలి మమతా! ఇప్పటికే కట్నం ఏభైవేలేనా అని ఎగతాళి చేస్తున్నారు మిత్రులు మరో చోటయితే లక్ష ఇచ్చేవాళ్లు" అన్నాడు.

"కట్నం ఏభైవేలేకావచ్చు. సంవత్సరానికి పాతికవేలు సంపాదిస్తున్నానుగా" అంది. మమత.

"అబ్బో బాగా లాజికల్‌గా మాట్లాడుతావే! ఏమో అనుకున్నాను" అన్నాడు భుజం మీద గమ్మత్తుగా చిన్నదెబ్బ చరుస్తూ. ఆ చేతిని సుతారంగా పక్కకు తీసేసింది మమత.

ఇంతలో వాళ్లద్దరి ముందూ ఒక కుర్రాడు వచ్చి నిల్చొని చేతులు చాచాడు. మమత ఏ ఆలోచనా లెకుండా ఆ అబ్బాయి చేతుల్లో బఠానీల పొట్లం పెట్టేసింది ఆ

దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై, ఆలోచనారీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.

సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావసరళిని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఏతరం రచయిత రచించినదైనా గానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు. ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

కుర్రాడు దాన్ని తీసుకుని వెళ్లగానే "అలా అడగ్గానే యిచ్చెయ్యటమేనా మమతా! పని లేని సోమరి వెధవలు. ప్రతిచోటా చేతులు చాపటమే" కాస్త మందలింపుగా అతడు అంటూంటే నివ్వెరపోయింది మమత.

నాలుగురోజుల క్రితం ఓ సాయంత్రం ఇంటికి వచ్చాడు భాస్కర్. ఏదో రాసుకుంటున్న మమత దాన్ని ఆపి అతనికెదురు వచ్చి చిర్నవ్వుతో ఆహ్వానించింది. అతను కూచున్న తర్వాత కప్పుకాఫీ తెచ్చి అందించి తనూ ఎదురుగా కూచుంది.

"తీరిక సమయాల్లో నువ్వేం చేస్తుంటావ్ మమతా" కాఫీ తాగుతూ అడిగాడు ఆమెతో మాటలు కలపటానికి.

"పుస్తకాలు చదువుతూంటాను. మా నాన్నగారి పుస్తకాలు చాలావున్నాయి ఇంట్లో...."

"నాకూ జనరల్ రీడింగ్ చాలా యిష్టం మమతా. మా ఇంటికి రెగ్యులర్‌గా, 'ధరణి,' 'ప్రీతి' వీక్లీలు తెప్పిస్తాం. అందులో సీరియల్స్ ఫాలోగావటం నాకు చాలా యిష్టం."

మమత మౌనంగా వింటూండిపోయింది.

అతను ఆపత్రికల్లోని కొన్ని సీరియల్స్‌ను ఎంత సస్పెన్స్‌గా, ఎంత థ్రిల్లింగ్‌గా ఉంటాయొ వర్ణిస్తూండిపోయాడు.

"ఆ సీరియల్స్ కటింగ్సన్నీ మా చెల్లాయి బైండ్ చేసి ఉంచింది. నువ్వు చదువుతానంటే తెచ్చి ఇస్తాను" అన్నాడు ఆసక్తిగా.

"ఆ సీరియల్స్ నాకు ఇష్టం ఉండవండీ" అంది మమత నెమ్మదిగా.

"మరి ఎలాంటి సీరియల్స్ నువ్విష్టపడతావ్"

"వాటి గొడవ ఎందుకు లెండి - మరేదైనా మాట్లాడండి" అంటూ సంభాషణమార్చబోయింది మమత

"అలా అంటే ఎలా! మన అభిరుచులు ఒకరి కొకరు తెలుసుకోవటం మంచిది కదా"

మమత అతని వేపు చూస్తూ "ఆ సీరియల్స్‌లో జీవితస్పర్శ ఉండదండీ, వాస్తవిక జీవితాన్ని మభ్యపెడతాయవన్నీ. ఒక కుహనా ప్రపంచాన్ని పాఠకుల కళ్లముందుంచి జీవితం పట్ల అనవసరమైన భ్రమలు పెంచుతారా రచయితలు - కాలక్షేపం కోసమైనా అలాంటి రచనలు చదవటం నాకు ఇష్టం ఉండదు" అంది వివరిస్తూన్నట్టు నెమ్మదిగా

భాస్కర్‌కు ఆమె మాటలు అయోమయంగా తోచాయి.

"మరి ఎలాంటి రచనలు నువ్విష్టపడతావ్" కాస్త ఉక్రోషంగా అడిగాడు.

"జీవిత వాస్తవికతను ప్రదర్శించే సాహిత్యం నాకు ఇష్టం. మనం జీవిస్తున్న సమాజంలోని ఘర్షణనూ, వాటి మూలల్నీ వ్యాఖ్యానించే సాహిత్యమే మన పాదాల్ని భూమికి ఆనేలా చేస్తుంది వ్యక్తిగత సంస్కారాన్ని పెంపొందించటంతో పాటు సాంఘిక సమస్యలపట్ల మన కర్తవ్యాన్ని నిర్దేశించేదే మంచి సాహిత్యం - అలాంటి రచనలే నాకు ఇష్టం." అంది.)

భాస్కర్‌కు ఆమె మాటల్లో ఒక్క ముక్క అర్థం కాలేదు. తన్నేదో ఆమె దెబ్బ తీసినట్టు అనిపించి "అయితే నువ్వుకోరే ఆమహాద్భుత రచనలు చేసే వాళ్లెవరండీ" అన్నాడు వెటకారం ధ్వనిస్తూ.

"మహీధర, కాళీపట్నం, విశ్వనాథరెడ్డి, రంగనాయకమ్మ ఓల్గా వీళ్లు చాలా మంచి రచయితలండీ" అంది నచ్చచెబుతూన్నట్టు.

"ఏమిటో మమతా! వీళ్ల పేర్లే విన లేదు నేను ఒక్క రంగనాయకమ్మ పేరు తప్ప! నాకు ధరణి, ప్రీతి వీక్లీల్లో సీరియల్స్ రాసే రచయితలే ఇష్టం" అన్నాడు తన అహాన్ని కాపాడుకొనే తీరులో, తీవ్రమైన స్వరంతో.

> "జీవిత వాస్తవికతను ప్రదర్శించే సాహిత్యం నాకు ఇష్టం. మనం జీవిస్తున్న సమాజంలోని ఘర్షణనూ, వాటి మూలాల్నీ వ్యాఖ్యానించే సాహిత్యమే మన పాదాల్ని భూమికి ఆనేలా చేస్తుంది. వ్యక్తిగత సంస్కారాన్ని పెంపొందించటంతో పాటు సాంఘిక సమస్యల పట్ల మన కర్తవ్యాన్ని నిర్దేశించేదే మంచి సాహిత్యం. అలాంటి రచనలే నాకు ఇష్టం.

అతని కంఠంలోని తీవ్రతను గుర్తించి "ఎవరి అభిరుచులు వారివి లెండి" అని సర్దిచెప్ప చూచినా, అతని సాంస్కృతిక స్థాయి ఆమెను కాస్త కలవరపెట్టింది.

బస్‌స్టాప్‌లో నిల్చున్న మమతకు ఇదంతా గుర్తుకు వచ్చింది. అతను ప్రస్తావించిన సినిమాల పేర్లుకూడా ఆ సమయంలో గుర్తుకు వచ్చి చీదర కలిగింది.

మరో మూడు నిమిషాల్లో 'టౌనుసర్వీస్' వచ్చి స్టాప్‌లో నిలబడింది. మమత వెనకవేపు డోర్‌నుంచి బస్సు ఎక్కింది.

బస్సు బాగా రష్‌గా ఉంది. ఇరవై మంది దాకా నిల్చొని ఉన్నారు. చోటు చేసుకుంటూ కాస్త ముందుకు కదలి, ఒక రాడ్ పట్టుకొని నిల్చుంది ఆమె. ఆడవాళ్ల సీట్లనిండా మగవాళ్లే కూచుని ఉన్నారు. ఆ ఊళ్లో టౌన్‌సర్వీసుల్లో ఒక పద్దతీ పాడూ లేదు. బస్సు ఎక్కగానే ముందు ఆడవాళ్ల సీట్లలోనే కూచుంటారు మగాళ్లు ఈ కండక్టర్లు కలక్షన్సే చూసుకుంటారు కాని ఆడవాళ్ల సీట్లలో వాళ్లనే కూచోపెట్టాలి అన్న పద్ధతి పాటించరు. ఆ పాటి సంస్కారం ఆమగాళ్లకూ ఉండదు. దబాయిస్తే గొడవలు. ఏ పది నిమిషాలో ప్రయాణం చేసేదానికి గొడవెందుకులే అని సర్దుకుపోతూంటారు ఆడవాళ్లు.

హాస్పెటల్ స్టాప్ దగ్గర ఆగింది బస్సు.

ఆ స్టాప్‌లో నలుగురైదుగురు దిగేశారు. మమత మరి కాస్తా ముందుకు జరిగి రద్దీలేని చోట నిల్చుంది. ముందు డోర్ లోంచి ఇద్దరు ఆడవాళ్లు ఎక్కారు.

బస్సు కదిలింది.

ఆ ఎక్కిన వాళ్లలో ఒకావిడ వయసు ముప్ఫయి ఏళ్లుండ వచ్చు. ఆమె చేతుల్లో ఒకనెల పసికందు. మరొకావిడ వృద్ధురాలు. శరీరం కాస్తా వంగి వుంది. వంగొనే ఆ బస్సులో ఓ పక్కగా నిల్చుంది. పసిపిల్ల నెత్తుకున్న స్త్రీ నిల్చోటానికి యిబ్బంది పడుతూవుంది.




మమతకు జాలేసింది ఆమెమీద. పసి పిల్లను చేతుల్లో పట్టుకొని నిల్చోటం ఎంత ఇబ్బంది! సీట్లలో కూచున్న వాళ్లెవ్వరూ ఆమె ఇబ్బందిని గమనించనట్టుగానే ఉండిపోయారు. ఒక బాలెంతరాలు నిల్చొనుంటే లేచి తమ సీటు ఆమెకు ఇద్దామన్న స్పృహ ఎవరికీ వచ్చినట్టులేదు. ఎంత బండగా మారిపోతున్నారు మనుషులు అనుకొంది మమత.

ఆడవాళ్లకు కేటాయించిన సీట్లల్లో కూడా మగాళ్లే కూచునున్నారు. పసిపిల్లను పట్టుకున్న ఆ బాలెంత స్త్రీ ముందుసీటు దగ్గరున్న ఇనుపరాడ్‌కు ఆనుకోటానికి ప్రయత్నిస్తూ, ముందుసీట్లో మొదట కూచున్న వ్యక్తిని 'కాస్తాలేచి సీటిస్తారా' అన్నట్టు నెమ్మదిగా అభ్యర్థిస్తోంది. మమత చూస్తోంది ఆవ్యక్తి వేపు. నోరు తెరచి అడుగుతోందిగదా తప్పక సీటు ఇస్తాడు అనుకుంటోంది.

ఆ సీట్లో కూచున్న వ్యక్తి ఆ స్త్రీ వేపు ఓ క్షణం పరకాయించి, నిర్లక్ష్యంగా పురుగును చూసినట్టు చూశాడు.

మమతకు వళ్లుమండింది ఆ మనిషి వైఖరికి

తాను దగ్గరగా ఉంటే నాలుగు చీవాట్లు వేసేది_అతన్ని.




ఆమె మరొక్కసారి అతన్ని అడిగింది చేతుల్లో పసిపిల్లను చూపిస్తూ. అతడేదో గొణుగుతూ సీటులేదన్నట్టు అరచేతిని ఆడిస్తూ, తలతిప్పి ఆమెవేపు అసహనంగా చూశాడు.

అప్పుడు చూసింది మమత అతడి వేపు జాగ్రత్తగా - ఎవరతను? భాస్కరేనా? అవును భాస్కరమే!!

ఆ ముఖం, ఆచేంపలు, ఆజుట్టూ, ఆతలతిప్పటమూ, అంతా భాస్కరే!

మమతకు చాలా దిగులువేసింది ఒక్కసారిగా! ఈ బండమనిషితోనా తను జీవితాంతం బతకటం!

ఆ తర్వాత స్టాప్‌లో బస్సు ఆగగానె చకచకా వెనుక డోర్‌నుంచీ కిందికి దిగేసింది ఆమె!

వేగంగా రోడ్డు క్రాస్ చేసి, అవతలి స్టాపులో నిల్చుంది, తన ఇంటివేపు వెళ్లే బస్సుకోసం ఎదురుచూస్తూ నింపాదిగా మమత.

స్ఫూర్తి కథకి ప్రతిస్పందన

# మతం మత్తుమందు

--బొమ్మెన శ్రీనివాసరావు

ప్రస్తుత సమాజంలోని జరిగే అకృత్యాలలో ప్రముఖమైనది "మతకలహం" ఈ అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని రచించిన "అగ్నిసర్పం" ప్రతి ఒక్క ఉపన్యాసకునిలో ఆలోచన రేకెత్తించేలా ఉంది.

మతం పేరిట జరుగుతున్న మారణ హోమాన్ని చూసి నిర్మల లాంటి యువతులు ఎంత మంది ఆక్రోశించి, ఆవేదన చెందగలరు? ఉపన్యాసి, వక్త అయిన నిర్మల తండ్రి నిర్మల అంతగా చలించిపోవడం చూసి మందలించడమే గాకుండా "ఇదంతా రాజకీయనాయకుల స్వార్థ ప్రయోజనం కొరకు చేసింది" అని చెప్పి నిప్పుకు సీరెత్తినట్టు మిన్నకుండి పోవడం చూస్తే బాధేస్తుంది. ఇలాంటి వారి మాటల, చర్యల వల్లే యువతలో సమజ రుగ్మతలను నిర్మూలించాలన్న పట్టుదల, ఉత్సాహం చచ్చిపోతుంది.

అయితే మత కలహాలు సంభవించినప్పుడల్లా శాంతి యాత్రలు జరపడం, అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం, వక్తలు మతసామరస్యం గురించి ఉపన్యాసాలు దంచడం లాంటి రొటీన్ పనులు ఈ కథలోను జరుగుతాయి.

కాని ప్రకాశమూర్తికి మొదటిసారిగా తన ప్రసంగం తనకే అసంతృప్తి నివ్వడం కథకి ఓ కొత్త మలుపు. తను ఇచ్చిన ప్రసంగం వల్ల ఓ మనిషి తన జీవితకాలం పాటు మతం మత్తులో ఏ తప్పు చేయకుండా ఉంటాడా అన్నది అతని అసంతృప్తికి కారణం కావచ్చు! నిర్మలకూడా తన తండ్రి ప్రసంగించినంత సేపు సంతృప్తిపడినా తిరిగి ఇంటికి వచ్చి మళ్లీ మతం పేరిట ప్రజలు చేస్తున్న దారుణ హింసలు చూసాక తాము చేసిన శాంతియాత్రలు, తండ్రి చెప్పిన ప్రసంగాలు ఏ మాత్రం ప్రజలని మార్చలేవని ఓ పచ్చి నిజాన్ని తెలుసుంటుంది.

కూతురు, భర్త చెప్పిన విషయాలు వింటూ సావిత్రి మొలకనవ్వు నవ్వుకోవడం చూస్తే ఆమె వీరికంటే తెలివైనదా? లేక మరోకారణం చేతా ఆ నవ్వు అనిపిస్తుంది. రచయిత ఈ పాత్రని సరిగా ఎస్టాబ్లిష్ చేయలేకపోయారు. అలాగే హిమశంకర్ గురించి కూడా అసంపూర్తిగా చెప్పడం జరిగింది. అసలు హిమశంకర్‌కు ఈ కథకు ఏమన్నా సంబంధం ఉందా?

చివర్లో కూడా రచయిత మతం గురించి యదార్థజ్ఞానాన్ని తెలుసుకోవాలి, సత్యాన్వేషణ చేయాలి అని ప్రకాశమూర్తి పాత్ర ద్వార చెప్పించారేగాని దాన్ని విశదీకరించలేకపోయారు. రచయిత మతమౌఢ్యం సమసిపోవడానికి సరియైన సూచనలు చేయలేకపోయారు కాబట్టి కథ అసంపూర్తిగా మిగిలిపోయినట్లనిపించింది.

అయితే రచయిత మాత్రం ఒక్క విషయం స్పష్టంచేశారు. అదే! మత రక్కసిని మట్టుపట్టడానికి శాంతి యాత్రలు, ఉపన్యాసాలు, వినతిపత్రాలు సమర్పించడం... వగైరా... వగైరా పనులు చేయడం వల్ల లాభంలేదని. కానీ ఎలా సమసిపోతుంది. ఎలా.... ఎలా....?